నమస్తే తెలంగాణ


# రంగారెడ్డి

I | హైదరాబాద్, ఆదివారం 29 సెప్టెంబర్ 2024 | RANGAREDDY


## పేదల ఉసురు తగులుతుంది



చైతన్యపురి, కొత్తపేట డివిజన్ల పరిధిలోని భవానీనగర్, వినాయక్‌నగర్, ఫణిగిరికాలనీ, సత్యానగర్, న్యూ మారుతీనగర్ కాలనీలకు చెందిన మూసీ నిర్వాసితులు.. నిరసన తెలిపారు. 'మా బతుకుల్లో ఏమైనా మార్పు తెస్తాడేమోనని మల్కాజిగిరి ఎంపీగా గెలిపించి.. రాజకీయ భిక్ష పెట్టినం. నిన్ను గెలిపిస్తే ఏ ఒక్కనాడు కాలనీల్లోకి వచ్చి ప్రజలు ఎలా ఉన్నారన్న చూసిన పాపాన పోలేదు. అయినా సహించాం.. పేదల ఉసురు నీకు తగులుతుంది'... అంటూ న్యూమారుతీనగర్ కాలనీకి చెందిన హేమలత శాపనార్థాలు పెట్టారు.



శనివారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే హరీశ్‌రావుతో తమ గోడు వెల్లబోసుకుంటున్న మూసీ నిర్వాసితులు



తెలంగాణ భవన్‌లో గోడు చెప్పకొని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న బాధితులు

# వేదన రోదన

## తెలంగాణ భవన్‌లో కన్నీరు మున్నీరైన మూసీ నిర్వాసితులు

ఆన్ గవర్నమెంట్ డ్యూటీ అని ఒక నలుగురు ఉన్న వెహికల్ మా కాలనీలో తిరుగుతుంటే వణుకుపుడుతున్నది. ఒక తెలియని 144 సెక్షన్ మా దగ్గర కనిపిస్తున్నది. మా ఇంటిని ఇంతకు ముందు ఎవరైనా చూస్తుంటే అందంగా ఉందికదా.. చూస్తున్నారు అనుకునేది. కానీ ఇప్పుడెవరైనా మా ఇంటివైపు చూస్తే గుబులు అనిపిస్తున్నది. వీళ్లెవరో.. ఏం చేస్తారో.. ఇళ్లు కూలగొట్టడానికి వచ్చారా అంటూ క్షణక్షణం భయంతో బతుకుతున్నాం. - ఇది ఓ మధ్యతరగతి యువకుడి ఆవేదన

ఈ వయసులో మాకిది అవసరమా.. మేం ఏం కావాలి.. మా జీవితమేంటి.. ఇవాళ మాట్లాడుతున్నం. రేపు ఎక్కడ ఉంటామో తెలియదు. అన్నీ లీగల్‌గా ఉన్నా..మమ్మల్ని ఇంత బాధపెడతరా.. అంటూ బోరుమంది ఓ మహిళ

నిన్న కూడా ఒక రిజిస్ట్రేషన్ అయింది. హైడ్రా వచ్చిందని రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌కు తెలియదా.. అంతెందుకు.. మేం కట్టే ఫీజు ఎవరికి పోతుంది. గవర్నమెంట్‌కే కాదా.. ఒక వ్యవస్థ లోపానికి ప్రజలను బలిచేస్తారా.. మా పేరెంట్స్, పిల్లలతో సహా మేం రోడ్డున పడాలా.. మీకు పేరెంట్స్, పిల్లలు లేరా.. వాళ్లకు కూడా అలాగే జరిగితే సంతోషపడతారా.. రేవంత్‌రెడ్డిని సూటిగా ప్రశ్నించిందో మధ్య తరగతి యువతి

– సిటీబ్యూరో, సెప్టెంబర్ 28 ( నమస్తే తెలంగాణ )

మేం ఉన్నత విద్య చదువుకున్నాం. గౌరవ కుటుంబాల నుంచి వచ్చాం. అన్నీ చూసుకుని లీగల్‌గా ఉన్నాకనే కొనుక్కున్నాం. లక్షలు లక్షలు రుణం తీసుకుని ఇల్లు కట్టుకుంటే మమ్మల్ని కబ్జాదారులు అంటారా.. చాలా బాధగా అనిపిస్తున్నది. బిల్డర్స్‌తో మీరు కుమ్మక్కవుతారు.. మమ్మల్ని రోడ్డు మీద పడేస్తారా..ఇదెక్కడి పాలన.. ఓ యువ ఉద్యోగి ప్రశ్న ఇది.

తెలంగాణ భవన్‌కు శనివారం తరలివచ్చిన హైడ్రా బాధితులు మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డిని కలిసి బోరుమన్నారు. ఒకవైపు తాము అన్నీ లీగల్‌గా డాక్యుమెంట్స్ చూసుకొని.. బ్యాంకులు వెరిఫికేషన్లు చేసి లోన్లు ఇస్తే..ఇన్నేండ్ల తర్వాత వచ్చి కబ్జాదారులంటుంటే తమకు ఎంత బాధగా ఉందో తెలుసా అంటూ ఏడ్చేశారు. 'ఏం చెప్పకుండా మా ఇండ్లు కూలగొడ్తామంటే ఎక్కడికి పోవాలి.. పిల్లలతో సహా రోడ్డున పడాల్నా' అంటూ ప్రశ్నించారు. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇండ్లకు మార్కింగ్ చేశారని, పేదతరగతి, మధ్యతరగతి కుటుంబాల ఇళ్లను కూల్చడమే అభివృద్ధి చేయడమా అని ప్రశ్నించారు.



మమ్మల్ని రోడ్డు మీద పడేస్తారా..
క్షణక్షణం భయంతో బతుకుతున్నాం..
ఎక్కడికి పోవాలి.. పిల్లలతో సహా రోడ్డున పడాల్నా..
బీఆర్‌ఎస్ నేతలను ఆశ్రయించి.. గోడు వెల్లబోసుకున్న బాధితులు
కాంగ్రెస్ ప్రభుత్వానికి శాపనార్థాలు

# స్థానిక పోరుకు సన్నద్ధం

గ్రామపంచాయతీ తుది ఓటరు జాబితా విడుదల
వికారాబాద్ జిల్లాలో 6,71,940 మంది ఓటర్లు
రంగారెడ్డి జిల్లాలో 7,94,651 మంది..







బొంరాస్‌పేట/ఇబ్రహీంపట్నంరూరల్, సెప్టెంబర్ 28 : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం గత కొద్ది రోజులుగా గ్రామాల్లోని వార్డుల వారీగా ఓటరు జాబితాను రూపొందించింది. ఈ నెల 6వ తేదీన గ్రామాల్లో వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ఆ తరువాత 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ప్రదర్శించిన జాబితాలో తప్పుల సవరణకు, అభ్యంతరాలకు సమయం ఇచ్చారు. అధికారులు వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితాను శనివారం ప్రకటించారు. అధికారులు ప్రకటించిన తుది జాబితా ప్రకారం వికారాబాద్ జిల్లాలోని 18 మండలాల్లో 585 గ్రామ పంచాయతీలు ఉండగా 4982 వార్డులు ఉన్నాయి. కులకచర్లలో అత్యధికంగా 49,212 మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా బంట్వారం మండలంలో 17,278 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 6,71,940 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 3,32,038 మంది కాగా, మహిళా ఓటర్లు 3,39,885 మంది, ఇతరులు 17 మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల కన్నా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో వారి స్థానంలో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించి పాలన కొనసాగిస్తున్నది. గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఎన్నికలకు సంబంధించి ముందస్తు కార్యాచరణలో భాగంగా ఎన్నికల సంఘం కార్యాచరణ ప్రణాళికను పూర్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా వార్డులు, పంచాయతీల రిజర్వేషన్ అంశంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. రిజర్వేషన్ల ప్రక్రియ కొలిక్కి వస్తేనే ఎన్నికల నిర్వహణకు అడుగులు ముందుకు పడుతాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కులగణన పూర్తి చేసిన తరువాతే రిజర్వేషన్లు ప్రకటించి ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది.

### రంగారెడ్డి జిల్లాలో..

ఇబ్రహీంపట్నంరూరల్, సెప్టెంబర్ 28 : రంగారెడ్డి జిల్లాలోని 549 గ్రామపంచాయతీలకు సంబంధించిన ఓటర్ల జాబితాను ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించాలని కలెక్టర్ శశాంక ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీరాజ్ అధికారి సురేశ్‌మోహన్ శనివారం తెలిపారు. గ్రామపంచాయతీ వార్డుల వారీగా ఓటర్ల జాబితాను గ్రామ పంచాయతీ కార్యదర్శులు తమకు చెందిన గ్రామాల్లో పంచాయతీ కార్యాలయం నోటీస్ బోర్డుపై అంటించాలన్నారు. ఈ ముసాయిదా ఓటర్ల జాబితాను ఇప్పటికే ప్రజలు పరిశీలనార్థం ప్రచురించారని తెలిపారు. జిల్లాలో 7,94,651 ఓటర్లకు గానూ పురుషులు 3,99,404, స్త్రీలు 3,95,214, ఇతరులు 33 మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ముసాయిదా జాబితాపై వచ్చిన 10,441 అభ్యంతరాలను పరిష్కరించామన్నారు. పేర్లను గ్రామపంచాయతీల్లోని వార్డులకు ఇంటి నంబర్ వారి వరుస క్రమంలో చేర్చి వారివారి ఓటర్ల జాబితాను తయారు చేయగా, ఎంపీడీవో, జిల్లా సహాయ ఎన్నికల అధికారులు టీ పోల్‌లో అప్లోడ్ చేయగా, గ్రామపంచాయతీ ఓటర్ల జాబితా ప్రచురణ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి పోల్‌లో ఆమోదించినట్లు తెలిపారు. మున్సిపాలిటీల్లో విలీనమైన 12 గ్రామపంచాయతీల ఓటరు జాబితా ప్రచురించలేదన్నారు. జిల్లావ్యాప్తంగా 79,4651 ఓట్లు ఉండగా, మొత్తంగా జిల్లాలో 399404 పురుష ఓటర్లు, 395214 మహిళలు ఉన్నారు. ఇతరులు 33 మంది ఉన్నట్లు జిల్లా పంచాయతీ అధికారి పేర్కొన్నారు.

# బతుకులు చెల్లాచెదురు

## 14 ప్రాంతాలకు మూసీ నిర్వాసితులు

సిటీబ్యూరో: కొత్త ఇంట్లో కాలు పెట్టాలంటే.. పండుగ వాతావరణంతో సందడి సందడి కనిపిస్తుంది. కుటుంబ సభ్యులు, బంధువుల నవ్వుల మధ్య.. బ్యాండు బాజా సప్పుళ్లతో ఆ ఇంట్లో అడుగుపెడుతారు. కానీ మూసీ నిర్వాసితుల పరిస్థితి దయనీయం. గూడు కోల్పోయి.. కన్నీటితో ఇష్టం లేని ఇంట్లో అడుగు పెట్టే దుస్థితి రావడం కలిచివేస్తున్నది. మూసీ పరీవాహక ప్రాంతాల్లోని వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో కేటాయిస్తున్నారు. ఇప్పటి వరకు అందరూ కలిసి మెలిసి పక్కపక్కన నివాసాలతో పెనవేసుకున్న బంధాలు కూల్చివేతల అనంతరం చెల్లాచెదురు కానున్నాయి. ఇప్పటికే అంబర్‌పేట, హిమాయత్ నగర్, ముసారాంబాగ్, కేసీఆర్‌నగర్ పరిధిలో కొందరికీ డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలు ఇచ్చి ఖాళీ చేయించారు. ఇష్టం లేకున్నా.. భయంతో వెళ్తున్నట్లు బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. 20 ఏండ్లుగా ఇక్కడే నివాసం ఉండి అందరితో కలిసిమెలిసి జీవించిన తాము ఇప్పుడు వీళ్లందరిని వదిలేసి దూరంగా వెళ్లడం ఎంత నరకంగా ఉంటుందో మనసున్న వారికి మాత్రమే అర్థమవుతుందని మాధవి అనే మహిళ బోరునవిలపించింది. కాగా, మూసీ నిర్వాసితులకు పిల్లిగుడిసెలు, జంగమ్మెట్, ప్రతాపసింగారం, సాయి చరణ్ కాలనీ, కమలానగర్, కొల్లూర్-1, గాంధీనగర్, జై భవానీ నగర్, తిమ్మాయిగూడ, నార్సింగి, బండ్లగూడ, పోచంపల్లి, బాచుపల్లిలో ఉన్న నివాస సముదాయాల్లో డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయిస్తున్నారు. మహానగరంలోని 14 ప్రాంతాల్లో మూసీ నిర్వాసితులను తరలించేందుకు రంగం సిద్ధం చేశారు.



శంకర్‌నగర్ నుంచి ఇండ్లు ఖాళీ చేసి తరలివెళ్తున్న నిర్వాసితులు



# ప్రజలు సహకరిస్తే మెరుగైన వసతులు కల్పిస్తాం..

రంగారెడ్డి కలెక్టర్ శశాంక
ఎవరినీ భయపెట్టి, బెదిరించి పంపించం

రాజేంద్రనగర్‌లో విలేకరుల సమావేశం

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 28 : మూసీ పరీవాహక ప్రాంతాల్లో అధికారులు మా ర్కింగ్ చేసిన ఇండ్ల ప్రజలు స్వచ్ఛందంగా ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలోకి వెళ్తే వారికి మెరుగైన వసతులు కల్పిస్తామని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. శనివారం సాయంత్రం రాజేంద్రనగర్‌లోని తహసీల్దార్ కార్యాల యంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘట్ వరకు 11.7 కిలోమీటర్లు, బాపూఘట్ నుంచి జియాగూడ కమేలా వరకు నాలుగు కిలోమీటర్లు, హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘట్‌కు 9 కిలోమీట ర్లు రంగారెడ్డి జిల్లా పరిధిలోకి వస్తాయన్నారు. గండిపేట, రాజేంద్రనగర్ మండలాల్లోని మూసీ పరివాహక ప్రాంతాల్లో దాదాపుగా 339 ఇండ్లను గుర్తించామని ..ఇవి కేవలం రివర్ బెడ్ ప్రాంతంలో ఉన్న నిర్మాణాలేనని.. అధికారులు, సిబ్బంది వెళ్లి చర్చలు జరుపుతున్నదీ ఆ కుటుంబాలతోనని ఆయన స్పష్టం చేశారు. వారు స్వచ్ఛందంగా అంగీకరించి వెళ్తామంటే నార్సింగి, జియాగూడల్లో అన్ని రకాల మౌలిక వసతులతో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను కేటాయిస్తామన్నారు. శనివారం సాయంత్రం వరకు 22 కుటుంబాలు వారికి కేటాయించిన ఇండ్లకు వెళ్లారని.. ఆదివారమూ మరికొంత మంది వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భం గా డబుల్ బెడ్‌రూం ఇండ్లలోకి వెళ్లిన పలువురు.. ఆ ఇండ్లలో మరిన్ని వసతులు కల్పించాలని, మహిళా సంఘాల్లో సభ్యులుగా చేర్పించాలని, బ్యాంకు రుణాలు అందేలా చూడాలని కోరుతున్నారని.. వారిని అన్ని విధాలా ఆదుకుని పునరావా సం కల్పిస్తామని కలెక్టర్ శశాంక హామీ ఇచ్చారు. ఎవరినీ భయపెట్టి, బెదిరించి ఇం డ్ల నుంచి పంపించే యత్నం చేయమని తేల్చి చెప్పారు. ప్రజలు అధికారులు, సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతి మాసింగ్, ఆర్డీవో వెంకట్‌రెడ్డి, రాజేంద్రనగర్ తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.